తెనాలి

• తెనాలి • పొన్నూరు

వీరాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పాలక మండలి సభ్యులతో బొలిశెట్టి

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయంలోని వీరాంజనేయస్వామిని శుక్రవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ జీఎంఎస్.గుప్తా, పాలక మండలి సభ్యులు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వజ్రాణం మార్కండేయబాబు జనసేన పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

18 ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: 'సర్' కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించేందుకు 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ వివరాలను తెలియజేశారు. ఓటర్ల జాబితాల పరిశీలనతోపాటు, డిజిటలైజేషన్ చేయనున్నట్లు వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం:	2,500
అత్యల్పం:	1,200
సగటు:	1,700

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మట్టి పడింది.. దశ మారింది

చెరువు అభివృద్ధితో డొంక రోడ్లకు మహర్దశ

న్యూస్‌టుడే, చేబ్రోలు

డొంక రహదారులు కొన్నిచోట్ల ఆక్రమణలకు గురి కావడం, మరికొన్ని చోట్ల అధ్వానంగా మారడంతో రైతులు కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. సరైన దారి లేక రోజుల తరబడి పంటను పొలాల్లోనే ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆకాల వర్షాలు, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నాని రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూసేవారు. ఇలాంటి సమస్యలన్నింటికీ స్వస్తి పలికేలా మండలంలోని వడ్లమూడి గ్రామంలో ఉన్న అన్ని డొంక మార్గాలను ఆధునీకరించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

❖ వడ్లమూడిలోని పెదచెరువు ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకం కింద ఎంపికైంది. చెరువులో పూడిక తీసి చుట్టూ వాకింగ్ ట్రాక్, జిమ్, పార్కు ఏర్పాటు చేసేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. చెరువులో నాణ్యమైన ఎర్ర గ్రావెల్ మట్టి ఉండడంతో.. దానితో డొంక రోడ్లు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అధికారులకు సూచించారు.

❖ కొమ్మమూరు కాలువ నుంచి పెనుగుదురుపాడు వరకు ఉన్న డొంక ఎప్పుడో ఆక్రమణలకు గురైంది. ఇక్కడ కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. తాజాగా సర్వే చేయించి సుమారు 3 కి.మీ. మేర ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడంతోపాటు మధ్యలో మూడు కల్వర్టులను నిర్మించారు.

❖ చేబ్రోలులోని శ్రీరంగపురం శివారు నుంచి కొమ్మమూరు కాలువ వరకు ఉన్న అగ్రహారం డొంకను రైతుల పూర్తిగా మర్చిపోయారు. ఏటా పండించిన పంటలు, ఎరువులు తీసుకువెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని అధిగమించేలా దానిని పునఃనిర్మించారు.

❖ కొమ్మమూరు కాలువ వంతెన పక్కన ఉన్న రెండు డొంకలతోపాటు గరువుపాలెం నుంచి కొమ్మమూరు వంతెన వరకు ఉన్నవాటిని మెరక చేసి రైతన్నకు ఇబ్బందుల్లేకుండా చేశారు.

❖ గ్రామంలో ఉన్న రెండు హిందూ శ్మశానవాటికలు లోతట్టు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షాకాలంలో ఇక్కడ నీళ్లు నిలిచి దహన సంస్కారాలు సైతం సరిగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు వాటిని మెరక చేయడంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెనుగుదురుపాడు డొంక రోడ్డు ఇప్పుడిలా..

5న టెట్‌పై అవగాహన తరగతులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: టెట్ పరీక్షలపై అవగాహన కోసం ఈ నెల 5న తరగతులు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు తెలిపారు. శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో అవగాహన తరగతుల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెట్ పరీక్షలో అత్యంత ముఖ్యమైన సైకాలజీ సబ్జెక్టుపై అవగాహన తరగతులు ఉంటాయని, లింగస్వామి తరగతులు బోధిస్తారన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రావు, కళాధర్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనే వారికి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ యూటీఎఫ్ తయారు చేసిన టెట్ పుస్తకాలు కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు 77024 92777, 70363 59015 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎండీ షకీలాబేగం, తదితరులు పాల్గొన్నారు.

తామ్రపత్ర గ్రహీతల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ నేడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు చేతుల మీదుగా తెనాలికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, తామ్రపత్ర గ్రహీతలు రూపాకుల విశాలాక్షి, సుబ్రహ్మణ్యం దంపతుల కాంస్య విగ్రహాలను శనివారం ఆవిష్కరించనున్నట్లు రాజీవ్‌గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల దాష్టీకాలను ఎదుర్కొంటూ ముఖ్య నాయకులతోపాటు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారని చెప్పారు. శనివారం సాయంత్రం ముత్తంశెట్టిపాలెంలోని తమ స్వగృహంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని పేదలకు వస్త్రదానం చేయనున్నట్లు ఆయన వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని ఆలూరు రోడ్డులో రహదారి పగుళ్లిచ్చింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి
- ఎ.రామారావు, ఆలూరు రోడ్డు. ✔ ఆ విధంగా చర్యలు తీసుకుంటాం **-సాయి, సహాయ ఇంజినీరు.**

? పొన్నూరు పట్టణ పరిధిలోని విద్యానగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి **-కె.ప్రశాంతి, విద్యానగర్.** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.
- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి

స్పందన: వీవర్స్ కాలనీలో వీధి దీపం పాడైపోయిందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' వేదికగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు మరమ్మతులు చేసి బాగు చేశారు. సమస్య పరిష్కరించారు. **- పొన్నూరు న్యూస్‌టుడే.**

సంఘ భవనానికి రూ.లక్ష అందజేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విజయవాడలో నిర్మిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ భవనం కోసం రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు తెనాలికి చెందిన ఉపాధ్యాయుడు, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిపూర్ణప్రసాద్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసత్యనారాయణ, బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం తెనాలికి చెందిన సీనియర్ నాయకుడు రమేష్ ఇంటికి వచ్చినప్పుడు చెక్కు అందించినట్లు వివరించారు.

గాంధీ వృద్ధాశ్రమానికి రూ.51 వేల విరాళం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దివంగత వజ్రాల రామలింగాచారి స్థాపించిన గాంధీ వృద్ధాశ్రమానికి తెనాలి మానవత ప్రతినిధులు రూ.51 వేల విరాళాన్ని అందించారు. ఆశ్రమంలో రామలింగాచారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొత్త సుబ్రహ్మణ్యం, డాక్టర్ కొలసాని రాంచంద్, వాసు, వెంకట్, ఓంకార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి సంజయ్‌దేవ్ సేవలు ఎనలేనివి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ప్రముఖ రచయిత, సాహితీవేత్త, చిత్రకారుడు, బహుభాషా పండితుడు సంజయ్‌దేవ్ జయంతి కార్యక్రమాన్ని మనంగా నిర్వహించారు. రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంజయ్‌దేవ్ చిత్రపటానికి రెక్టార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజయ్‌దేవ్ చిత్రంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రెక్టార్ మాట్లాడుతూ సంజయ్‌దేవ్ తెలుగు కళా, సాహిత్యానికి అనేక సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, ఫైన్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు జాన్‌రత్నబాబు, వీరయ్య, దేవ్‌కాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు గీసిన చిత్రాలు పరిశీలిస్తున్న రెక్టార్

పాఠశాలలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆర్డీవో కె.శ్రీరమణి తెనాలి పట్టణ చెంచుపేటలోని కోగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బడి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, తాగునీటి ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడం, విద్యార్థినుల కోసం నిర్మించిన బయో టాయిలెట్లకు తాళాలు వేసి ఉండడం వంటి సమస్యలను ఆమె గుర్తించారు. సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డిని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీరమణి

తెనాలి టౌన్: తెనాలి ఆర్డీవో కె.శ్రీరమణి తన కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై సర్ కార్యక్రమ ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమానికి మరి కొంత అదనపు సమయం అవసరమని, పత్రాలు పూరించడంలో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు.

మురుగు నీరు.. ప్రజలు బేజారు

పెదకాకాని బాజీబాబా దర్గా ప్రాంగణాన్ని ఆనుకొని గోండుల కాలనీ ఉంది. ఈ కాలనీవాసుల వాడకపు నీరు దర్గా ప్రాంగణంలోకి చేరుతుంది. దీనివల్ల స్థానికులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలోని వాడకపు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. **- పెదకాకాని, న్యూస్‌టుడే**

నీటి వృథా అరికట్టరూ..!

పట్టణ పరిధి నిడుబ్రోలులోని ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో ప్రధాన పైపులైనుకు లీకు ఏర్పడింది. నీరు వృథాగా పోతుంది. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు ఇంజినీరింగ్ సిబ్బందికి పిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-పొన్నూరు, న్యూస్‌టుడే**

గుంతల దారి.. ప్రమాదాలకు నిలయంగా మారి

రోడ్డు చూశారా ఎంత దారుణంగా ఉందో. అడుగడుగునా బారీ గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. తెనాలి నుంచి చెరుకుపల్లి వెళ్లే మార్గం పెదరావూరు నుంచి తురుమెళ్ల మధ్య సుమారు 5 కి.మీ మేర తీవ్రంగా ధ్వంసమైంది. వర్షాలు పడితే మరీ దారుణంగా ఉంటోందని, ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా అంటూ చోదకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

కూలితే ముప్పు.. ఏదీ కనువిప్పు

దెబ్బతిన్న అలవల, ఆరెమండ లాకులు

ఆందోళనలో అన్నదాతలు

న్యూస్‌టుడే, పొన్నూరు: మండల పరిధిలోని ఆరెమండ, అలవల సాగునీటి కాలువల వద్ద నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత వైకాపా పాలనలో నూతన లాకుల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తామని ఆనాటి నేతలు మాటలతోనే మభ్యపెట్టారు. ఇప్పుడు వాటి పరిస్థితి మరింత క్షీణించింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక రైతన్నలు కంగారు పడుతున్నారు.

❖ పొన్నూరు మండల పరిధిలోని ఆరెమండ, అలవల సాగునీటి కాలువల ద్వారా సుమారు 25 వేల ఎకరాలకు నీరు సరఫరా చేస్తున్నారు. నీటిని నియంత్రించేందుకు దాదా సంవత్సరాల క్రితం లాకులు నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆరెమండ లాకుల అడుగుభాగం ఒకవైపు కిందకు ఒరిగిపోయింది. నీరు ప్రవహించేందుకు అడ్డంకి ఏర్పడింది. ఆ లాకుల గోడలు సైతం పగుళ్లిచ్చి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

❖ అలవల లాకులపై పెద్ద రంధ్రం ఏర్పడింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే అన్నదాతలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయ పడుతున్నారు. గోడలు పగుళ్లిచ్చాయి. ఈ రెండూ కూలితే సాగు నీరంతా పొలాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ కాలువ కరకట్టలు కూడా బలహీనంగా ఉన్నాయి. గతంలో కట్టలు కోతకు గురికావడంతో ఇసుకబస్తాలు వేశారు. అవి కూడా కోతకు గురయ్యాయి. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకముందే కూటమి ప్రభుత్వం స్పందించి నూతన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

❖ దీనిపై సాగునీటిశాఖ సహాయ ఇంజినీర్ రవీంద్రను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అలవల, ఆరెమండ లాకులను నూతనంగా నిర్మించేందుకు కోటి రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారుల పరిశీలనకు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు మొదలుపెడతామన్నారు.

అలవల లాకులపై ఏర్పడిన రంధ్రం

రేపటి నుంచి తెనాలిలో రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: 2026 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు ఈనెల 5,6,7 తేదీలలో పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్టు తెనాలి నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు తెనాలిలో మాట్లాడారు. ఈ సందర్భంగా 5వ తేదీన రాష్ట్ర ఫిల్మ్, టీవీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బుర్రా సాయిమాధవ్‌కు ఆత్మీయ సత్కారం, 7న పాల్ హారిస్ పురస్కార ప్రదానం ఉంటాయని వివరించారు. నిర్వాహకులు నల్లూరు వెంకటేశ్వరరావు, ఈదర పూర్ణచంద్, గుమ్మడి ప్రసాద్, అయినాల మల్లేశ్వరరావు తదితరులు కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఏఎన్‌యూను సందర్శించిన సంధ్యా మెరైన్ ప్రతినిధులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలోని సంధ్యా మెరైన్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మదన్‌మోహన్, వైష్ణవికుమార్‌లు శుక్రవారం విశ్వవిద్యాలయంలో పర్యటించారు. ఏఎన్‌యూతో ఎంవోయూ చేసుకునేందుకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంతో చర్చలు జరిపారు. విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు, సాంకేతిక సహకారం, విద్యార్థులకు శిక్షణ, పరిశ్రమ-విద్యా సంస్థల బాగస్వామ్యం తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు. విశ్వవిద్యాలయంతో ఎంవోయూ చేసుకోవడం వల్ల ఆశ్యారైతులకు సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన సేవలు లభిస్తాయని సంస్థ సీఈవో మదన్‌మోహన్ చెప్పారు. విద్యార్థులకూ బహుళ ప్రయోజనాలుంటాయని శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ తోసీఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, ఆచార్య త్రిమూర్తిరావులు పాల్గొన్నారు.

ముగిసిన కార్యశాల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిజైన్, డెవలప్, అండ్ డెలివర్ మాస్‌వీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్స్) అండ్ ద అసోసియేటెడ్ ఎకో సిస్టం పేరుతో ఐదు రోజులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యశాల శుక్రవారంతో ముగిసింది. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కంటెంట్ డెవలప్‌మెంట్, మూక్స్ కోర్సుల పాఠ్యాంశాల రూపకల్పన, నాలుగు క్రెడిట్ కోర్సుల తయారీ, వీడియో పాఠ్యాంశాల తయారీ, డిజిటల్ బోధన వనరుల వినియోగం, అభ్యాస ఫలితాల మూల్యాంకన తదితర పద్ధతులపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న అధ్యాపకులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి సర్టిఫికెట్‌లు అందజేశారు.

మర్యాదపూర్వక సమావేశం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన డి.రవీంద్రబాబు శుక్రవారం గుంటూరులో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఉత్తమ సేవలకు గాను పలు పురస్కారాలు దక్కించుకుంది. అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అమరావతి రీజియన్‌లో ద్వితీయ ఉత్తమ అధ్యక్షునిగా, తృతీయ బెస్ట్ క్లబ్‌గా, ఇతర విభాగాల్లోనూ మొత్తం 17 పురస్కారాలు, 7 ప్రశంసాపత్రాలను అందుకుంది. గత నెల 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో క్లబ్బుల గవర్నర్ రాంప్రసాద్ చేతుల మీదుగా వాటిని క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తెనాలి క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన అధ్యక్షుడి అభినందన వేడుకలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు తెలంగాణా రాష్ట్రం, హన్మకొండ/వరంగల్ జిల్లా మరియు పట్టణం నివాసి, దోర్ నం.2-8-904/1, ఎస్బీఐ కాలనీ, వరికూటి వెంకట నాగలక్ష్మి W/o ప్రసాద్ నుండి నేనంటుచున్న పొంది ఇచ్చుచున్న సేల్ డీడ.

ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, సుద్దపల్లి గ్రామం పంచాయతీ కార్యదర్శుల సుబ్రహ్మణ్య వెంకటేశ్వర (టీడ) గారి భార్య వెంకటసుబ్బమ్మ మరియు వీరి కుమారులు నాగేశ్వరరావు, రామారావు, సుబ్బారావుడు, భువార్తి అక్కి, నాగమల్లేశ్వరి కలసి గుంటూరు జిల్లా చేబ్రోలు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో వారి కుటుంబ ఉమ్మడి భాగ పంపిణీ చేసుకుని పార్టిషన్ డీడ్రాసిన నం.2233/2012 ద్వారా రిజిస్టర్ కాబడి అందులో సుబ్రహ్మణ్య సుబ్బారాయుడు గారికి సుక్షమించిన బిడిమ్ నం.1నెం. నాటి నుండి వారి స్వాధీనానుభవములో సర్వ హక్కులతో అనుభవించుచున్న ఈ దిగువ షెడ్యూల్ రాజాలా ఆస్తిని నా క్లయింటు కొనదలచియున్నారు. కావున సదరు షెడ్యూల్ రాజాలా ఆస్తిపై ఏ విధమైన న్యాయపరమైన, చట్టపరమైన అక్షేపణలు, అభ్యంతరములు ఉన్నా యెడల ఈ నేటి నుండి 7 రోజుల లోపల తెలియపరచగలరు. తదుపరి ఏ విధమైన అభ్యంతరములు తెలియజేసినను అట్టివి నా క్లయింటును బద్ధపరచలేవు.

షెడ్యూల్: బిడిమ్ నెం.1 - గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్ డీ సుద్దపల్లి గ్రామ పంచాయితీ, సుద్దపల్లి గ్రామ ఏరియాలో తాలూకా 1) డి.నెం.208/2లో గల య.0.43 సెంట్లు హద్దులు తూర్పు: సుబ్రహ్మణ్య నాగేంద్రం గారి భూమి హద్దు దక్షిణం: సీ షెడ్యూల్ రాజా భూమి హద్దు, పడమర: సుబ్రహ్మణ్య కోటేశ్వరరావు గారి భూమి హద్దు, ఉత్తరం: 25 అంబటం భూమి హద్దు ఈ హద్దుల మధ్య య.0.43 సెంట్లు మాగాణి భూమి.

బిడిమ్ నెం.2 - గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్ డీ సుద్దపల్లి గ్రామ పంచాయితీ, సుద్దపల్లి గ్రామ ఏరియాలో తాలూకా 1) డి.నెం. 208/1 23లో గల య.0.43 సెంట్లు హద్దులు తూర్పు: మట్టుపల్లి సాంబయ్య గారి భూమి హద్దు, దక్షిణం: 15 అంబటం భూమి హద్దు, పడమర: పేడ బన్నా గారి భూమి హద్దు, ఉత్తరం: పైపుల రోడ్డు హద్దు.
ఈ హద్దుల మధ్య య.0.43 సెంట్లు మాగాణి భూమి.

తేదీ: 02-07-2026 తెనాలి — తాడిబోయిన శ్రీనివాసరావు, అడ్వకేట్, నాజరుపేట, తెనాలి. సెల్:9848363744

రవాణా సదుపాయం కల్పించండి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తాము చదువుకునే కళాశాలలు, ప్రభుత్వ పాఠశాల, వసతిగృహాలకు దూరంగా ఉన్నాయని, నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నందున రవాణా సదుపాయం కల్పించాలని బాలికలు అధికారులను కోరారు. శుక్రవారం తెనాలి ఆర్డీవో శ్రీరమణి ఆధ్వర్యంలో పట్టణ ఆర్.ఆర్.నగర్‌లోని ఎస్సీ పోస్ట్, ప్రీ మెట్రిక్ బాలికల హాస్టళ్ల, ఎస్సీ బాలికల గురుకులంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం నడుస్తున్న గురుకుల భవనం సరిపోవడం లేదని స్థలం కొని భవనం నిర్మించాల్సి ఉందని ఎస్సీ గురుకుల ప్రిన్సిపల్ విజయకుమార్ ఆర్డీవో, తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, ఎంఈవో జయంత్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు.

'సింద్‌బాద్ అద్భుత యాత్రలు' పుస్తకావిష్కరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన బాలసాహితీవేత్త, తెలుగు ఉపాధ్యాయుడు షేక్.అబ్దుల్ హకీం జానీ పిల్లల కోసం 'సాహస నావికుడు సింద్‌బాద్ అద్భుత యాత్రలు' నవలను రచించారు. అరేబియన్ నైట్స్ కథల్లో భాగంగా సింద్‌బాద్ సముద్రంపై చేసిన ఏడు సాహస యాత్రల ఈ పుస్తకాన్ని నెల్లూరుకు సమీపంలోని కృష్ణపట్నంలో గురువారం సీనియర్ నావికుడు, ముంబైకు చెందిన కెప్టెన్ కుమార్ ఆవిష్కరించినట్లు రచయిత తెనాలిలో శుక్రవారం తెలిపారు. హకీంజానీ ఇప్పటి వరకు 72కు పైగా పుస్తకాలను వివిధ విభాగాల్లో రచించారు. 1600లకు పైగా వ్యాసాలు రాశారు.

పూడికతీత పనుల ప్రారంభం

చేబ్రోలు, న్యూస్‌టుడే: పంట పొలాల్లో ఉన్న మురుగు నీరు బయటకు వెళ్లే కాలువల్లో పూడిక ఏర్పడినా గత ప్రభుత్వ హయాంలో దీనిని ఎవరూ పట్టించుకోలేదు. మండలంలోని మంచాల గ్రామంలో కనములగోడి మురుగు కాలువ పరిస్థితీ అంతే ఉండేది. దీంతో బారీ వర్షాలు వచ్చినప్పుడు పొలాల్లో నీళ్లు బయటకు పోయేవి కాదు. రోజుల తరబడి నీటిలో నాని పంట కుళ్లి రైతులు నష్టపోయిన సందర్భాలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు తమ సమస్యను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు ఆయన చర్యలు తీసుకోవడంతో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టెన్నికాయిట్ జట్టు ఎంపిక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్ జట్టు ఎంపిక తెనాలి మండలం అంగలకుదురు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌బాబు పర్యవేక్షించగా అంగలకుదురు పాఠశాల విద్యార్థినులు మేఘన, కీర్తి, భార్గవి, నీలిమ ఎంపికయ్యారు. జిల్లా తరఫున ఈ నెల 10వ తేదీ నుంచి ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయిని ఆనురాధ, వ్యాయామ ఉపాధ్యాయుడు రవిరాజు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికలతో ప్రధానోపా